# అటవీ రక్షణముసుగులో ఆదివాసులపై గొడ్డలి వేటు

**ఇటీవలి** కాలంలో ప్రధాని నరేంద్ర మోడీ దేశంలో మొత్తం పులుల సంఖ్యను విడుదల చేస్తూ పులుల రక్షితప్రాంతాలలో వన్యప్రాణులన్నీ సురక్షితంగానే ఉన్నాయని పేర్కొన్నాడు. వన్యప్రాణి సంరక్షణ, దేశంలో జీవవైవిధ్య పరిరక్షణ గురించి డిమాండ్ చేసే 'నిపుణులు' లేదా 'కార్యకర్తలు' ఈ సమాచారంతో చాలా సంతోషించారు. అయితే ఈ నిపుణులు లేదా కార్యకర్తలు అటవీ పరిరక్షణ పేరుతో జరుగుతున్న మానవ ప్రాణాల మనుగడకు సంబంధించిన విషాదాన్ని పరిగణలోకి తీసుకోవటానికే నిరాకరిస్తున్నారు.

మనదేశంలో 1,60,276 చ॥కి॥మీల వైశాల్యంలో వన్యమృగ సంరక్షణ కేంద్రాలు లేదా జాతీయ ఉద్యానవనాలు విస్తరించి వున్నాయి. రక్షిత ప్రాంతాలుగా అడవులు గుర్తించబడక మునుపే అడవులలోనే నివసిస్తూ, ఈ అడవులపై ఆధారపడి జీవనం సాగించే ఆదివాసీ ప్రజానీకం అక్కడ ఉన్నారు. ఈనాడు అటవీ సంరక్షణ పేరుతో అనాదిగా అడవినే నమ్ముకుని బతుకుతున్న అమాయక ఆదివాసీలను ఆక్రమణదారులంటూ అడవుల నుండి తరిమివేస్తూ చట్టవిరుద్ధంగా అడవులలో నివసిస్తున్నారని, ఆక్రమణదారులని వారిపై నేరారోపణ చేస్తున్నారు. అడవులలో నివసించే అమాయకప్రజల, ఆదివాసుల ప్రాణాలను బలిపెడుతూ ప్రభుత్వాలు రక్షిత అడవులుగా పేర్కొనే వాటిని సృష్టిస్తూ ఆదివాసుల ఉనికిని గుర్తించ నిరాకరిస్తున్నాయి.

ఒక అధ్యయనం ప్రకారం ప్రపంచ వ్యాపితంగా ఈ విధంగా కృత్రిమంగా రక్షిత అడవులు, అభయారణ్యాలు, ఉద్యానవనాల పేరిట అడవులను ఆక్రమించిన ఫలితంగా దాదాపు రెండు కోట్ల నుండి ఐదు కోట్ల మంది వరకు అటవీ ప్రజానీకం నిర్వాసితులుగా మారిపోయారు.

మనదేశంలో పులుల సంరక్షణ కేంద్రాలు, రక్షిత అడవులు పేరున అనేక ఆదిమ తెగల ప్రజానీకాన్ని వారి ఆవాసాల నుండి తొలగించి వారి జీవనాధారాలను ధ్వంసం చేశారు. ప్రభుత్వం ఈ విధంగా మట్టుబెట్ట బూనుకున్న ఆదివాసీ తెగలలో సోలిగాస్ అనేది ఒక తెగ. వీరిని బలవంతంగా అడవుల నుండి గెంటి వేసేందుకు, భారతదేశంలోని ఇతర పౌరులు అనుభవించే హక్కులను గుర్తించకుండా వీరిని రెండవ శ్రేణి పౌరులుగా పరిగణిస్తున్నారు.

కర్ణాటక రాష్ట్రం చామరాజనగర్ తహశీల్ పరిధిలోని కొల్లిగల్ అటవీప్రాంతం సోలిగాస్ యొక్క సహజసిద్ధ నివాస ప్రాంతంగా వుంది. ఈనాటి సోలిగాస్ యొక్క పూర్వీకులు ఈ అటవీ ప్రాంతాలలో స్వేచ్ఛగా సంచరిస్తూ జీవనం సాగించినవాళ్లే. పోడు వ్యవసాయం చేస్తూ అటవీ ప్రాంతాలలో సాగుచేస్తూ వారు జీవనం సాగించారు. ఈ పోడు వ్యవసాయం అటవీ ప్రాంతాల్లో ఆదివాసులు ఒక్కోచోట ఒక్కో విధంగా నిర్వహిస్తారు. ఆహారం కోసం వారు చిన్న జంతువులను వేటాడటంపై ఆధార పడతారు. తేనె, చింతపండు, వివిధ రకాల పండ్లు వంటి వివిధ అటవీ ఉత్పత్తులను సేకరించి వాటిని సమీప సంతలకు తీసుకెళ్లి అమ్ముకొని వారు జీవనం సాగించేవారు.

1974లో ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం పులులు, ఏనుగులు, దున్నపోతులకు ప్రసిద్ధి చెందిన ప్రాంతంగా గుర్తించి, బలిగిరి రంగనాథ స్వామి టెంపుల్ (బిఆర్‌టి) పులుల సంరక్షణా కేంద్రంగా ప్రకటించింది. దీనితో అటవీ ప్రాంతంలో ఆదివాసులు తమ ఆహారం కోసం సాగించే కొద్దిపాటి వేటను నిషేధించారు. అదేవిధంగా పోడు వ్యవసాయాన్ని ఆపివేయాలని ఆదేశించారు. మరొకవైపున అటవీ ఉత్పత్తులను సేకరించుకొని అమ్ముకొనటాన్ని కూడా నిలిపి వేశారు. ఈ పులుల సంరక్షణ కేంద్రం పరిధిలోని అనేకమందిని బలవంతంగా తొలగించారు; వారి జీవనాధారాలు నాశనంచేశారు; వారి స్వేచ్ఛను పూర్తిగా హరించారు. అప్పటివరకు వారి ఆవాసాలుగా నున్నవే, వారు ప్రవేశించ వీలులేని నిషిద్ధ ప్రాంతాలుగా మార్చారు. తమ అడవితల్లిపై హక్కుకోసం రెండవశ్రేణి పౌరులుగా వారు ఆందోళన చేస్తున్నారు.

ప్రస్తుతం ఈ ఆదివాసీలను తరలించి ఉంచే ప్రదేశాలలో నీరు, విద్యుత్తు, ఆరోగ్యరక్షణ, బిడ్డల రక్షణ, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు, సౌకర్యాలన్నింటికి అనుమతులు తీసుకోవాలి. అధికారుల విచక్షణాధికారంపై ఆధారపడి ఈ అనుమతులు ఉంటాయి. ఎక్కడికైనా వెళ్లాలంటే కచ్చారోడ్‌లను ఉపయో గించాలి. అలాగే బయటకు వెళ్లిన వారు సాయంత్రం ఆరుకల్లా తిరిగి ఆవాసాలకు చేరుకోవాల్సి ఉంటుంది.

ఈ ఆవాసాలను వదిలి వెళ్లేందుకు అంగీకరించవలసిందిగా అటవీశాఖ అధికారులు వీరిపై వత్తిడి చేస్తున్నారు. గతంలో కూడా జేనుకుర్బాలనబడే ఆదివాసీల తెగవారిని కూడా బందీపూర్ పులుల సంరక్షణ కేంద్రం పరిధిలో నుండి బలవంతంగా గెంటివేశారు. వీరందరినీ పాకలలో నివాసముంచి, వీరికి సాగు చేయబడని బీడు భూములను అప్పగించారు. వీరంతా అటవీ శైలి జీవితాన్ని పూర్తిగా కోల్పోయి, సేవకులుగా రోజువారీ కూలీలుగా మారాల్సి వచ్చింది. జేనుకుర్బాల విషాద పరిస్థితిని దృష్టిలో పెట్టుకునే సోలిగాస్‌వారి ఆవాసాలను విడిచి వెళ్ళేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించటంలేదు. సమాన పౌరులుగా తమనూ

పరిగణించాలని వీరు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. రోడ్లు, విద్యుత్తు, పాఠశాల, ఆసుపత్రి అలాగే అటవీ హక్కులచట్టం – 2006 ద్వారా సంక్రమించిన హక్కులను డిమాండ్ చేస్తున్నారు.

దేశవ్యాపిత పులుల గణాంకాలను దేశ ప్రధాని వెల్లడిచేసిన రోజునే భారతదేశంలో పులుల సంరక్షణ కేంద్రాల సమర్థ యాజమాన్య మూల్యాంకనము గురించిన మరో నివేదిక కూడా వెల్లడైంది. ఈ నివేదికలో సోలిగాస్ యొక్క డిమాండ్లు రిజర్వు అటవీశాఖ అధికారులకు నిరంతర తలనొప్పిగా మారాయి అని పేర్కొన్నారు. దీనితో తమ ఆర్థికపరమైన, భౌతికపరమైన హక్కులకు శాశ్వతమైన బలమైన ముప్పు ముంచుకొస్తుందని సోలిగాస్‌కు అర్థమైంది. ప్రభుత్వం మరియు కొన్ని వన్యప్రాణి బృందాలు ఈ విధమైన ఆదివాసి వ్యతిరేక దృక్పథంతో ఆదివాసీలను ఆవాసాల నుండి తొలగించాలని కోరుకుంటున్నారు. భారతదేశ జీవవైవిధ్యాన్ని పరిరక్షించాలనే పేరుతో భారతదేశంలో నివసిస్తున్న కోట్లాది మంది నిరుపేదలైన అమాయక ఆదివాసీలను వారి సహజసిద్ధ ఆవాసాల నుండి నిర్దాక్షిణ్యంగా తొలగింప జూస్తున్నారు.

అయితే ఈ అధికారులు, పరిరక్షణా బృందాలు అటవీ ప్రాంతాల్లో స్వేచ్ఛగా విచ్చలవిడిగా వ్యాపార దృష్టితో సాగుతున్న గనుల తవ్వకాన్ని, ఇతర మౌలికరంగ పరిశ్రమల ఏర్పాటును ఏనాడూ అభ్యంతరపెట్టలేదు. బ్రెజిల్‌లో అమెజాన్ అడవులలోని విశాల అటవీ ప్రాంతాలను వ్యాపార ప్రయోజనాలకు ఉపయో గించజూసే ప్రయత్నాలను 400 ఆదిమజాతి సమూహాలు నిరోధించాయనేది జగమెరిగిన సత్యం. అయితే మనదేశంలో ప్రభుత్వమే వ్యాపార ప్రయోజనాలకు అడవులను కట్ట బెట్టుతూ అనుమతుల నిస్తోంది. వారు అడవులను విచ్చలవిడిగా నరికివేస్తున్నారు. గత రెండు దశాబ్దాల కాలంలో అడవుల నరికివేత గురించి ప్రభుత్వంవద్దకు వచ్చిన ప్రతిపాదనలలో 90 శాతం ఆమోదంపొందాయని గణాంకాలు చెబుతున్నాయి. మరోవైపున జాతీయ గనుల అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్ఎండిసి) ప్రభుత్వానికి బహుళజాతి కంపెనీలకు మధ్య వారధిగా వ్యవహరిస్తూ ఆ కంపెనీలకు చట్టబద్ధ అనుమతులు సులభంగా వచ్చేందుకు మార్గాన్ని సుగమంచేస్తోంది. అదే సమయంలో తరతరాలుగా ఆదివాసీలు నివసిస్తున్న వారి భూములలో ఉండేందుకు మాత్రం వారికి అనుమతి నిరాకరిస్తోంది. అటవీపరిరక్షణ, జీవన వైవిధ్యాన్ని పరిరక్షించటం వంటి బడాయి మాటల మాటున వంచన ఇలాఉంది.

వరుసగా పాలన సాగిస్తున్న పాలకులు, అడవులను పరిరక్షించే పేరున ఆదివాసీలను అడవులనుండి ఖాళీ చేయించేందుకు ప్రస్తుతం వన్యప్రాణిరక్షణ బృందాలు తమ శక్తియుక్తులతో సుప్రీంకోర్టులో వాదనలు చేస్తున్నాయి. 18 లక్షల మంది ఆదివాసులను తొలగించడంపై సుప్రీమ్ కోర్టు విధించిన స్టేను రద్దు చేయించాలని చూస్తున్నారు.

ఆదివాసి ప్రజలకు వ్యతిరేకంగా సమాజంలో నాగరిక విభాగాలుగా చెప్పబడుతున్న వారి అనాగరికత్వం తీవ్రంగా ఖండించదగినది. ఆదివాసీల అటవీహక్కు అన్ని విధాల పరిరక్షించ బడాలి. దేశంలోని యావత్తు ప్రజాస్వామికవాదుల డిమాండ్ అదే కావాలి.

ooo